ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రబీ సాగుపై అయోమయం

- జాడలేని వాన - ఖరీఫ్ పైర్లను కాపాడుకునేందుకు తంటాలు
- రైతుల కంటిపై కునుకు కరువు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సాగు అగమ్యగోచరంగా మారింది. గతనెల రోజులుగా వర్షం కురవకపోవడంతో రెండో పంటగా సాగు చేయాల్సిన రబీలో ఏ పంటలు వేయాలలో అర్థమవ్వగా రైతుల్లో అయోమయం నెలకొంది. వర్షం అవసరమైనప్పుడు కురవకపోవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పైర్లు ఎదుగుదల, దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. గత 24 రోజులుగా జిల్లాలో కనీసవర్షం కురవ లేదు. అక్టోబరులో 129.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 15.8 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదైంది. వర్షాభావం ప్రభావం అటు ఖరీఫ్, ఇటు రబీపైర్లపై పడుతోంది.

గుంటూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి కోతల తరువాత రబీలో జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది వర్షాభావంతో వరి పైరు ఇప్పటికే బెట్టకొచ్చింది. కొన్నిచోట్ల పొట్టదశకు రావడంతో నీటి అవసరం పెరిగింది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నుంచి 9,379 క్యూసెక్కుల నీటిని తూర్పు, పశ్చిమ డెల్టాలకు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టాపరిధిలో గుంటూరు, బాపట్ల జిల్లాలు ఉన్నాయి. తూర్పు డెల్టా పరిధిలో ఉమ్మడి కృష్ణా జిల్లా ఉంది. పశ్చిమ డెల్టాకు మంగళవారం 4209 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 5,085 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి ఆరు వేల క్యూసెక్కులు, పట్టిసీమ నుంచి 3 వేల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీకి వస్తోంది. దీంతో డెల్టాకు కొంత మేరకు ఉపశమనం కల్గుతోంది. కానీ చివరి భూములకు నీరందడం లేదు. అంతేగాక డెల్టాకాల్వల మరమ్మతుల సకాలంలో చేయకపోవడం వల్ల కూడా ఇబ్బంది పొలాలకునీరు అందడంలేదు. ఎక్కువ మంది రైతులు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీని వల్ల రైతులకు ఖర్చులు పెరుగుతున్నాయి.

మరోవైపు పత్తి, మిర్చి పైర్లు వర్షాభావం వల్ల బెట్టకు వచ్చాయి. మెట్ట ప్రాంతంలో సాగర్ కాల్వలకు నీరు రాకపోవడం వల్ల ఈ పైర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రధానంగా తాడికొండ, పత్తిపాడు నియోజకవర్గాల్లోని సాగర్ కాల్వలకు చివర ఉన్న దాదాపు 50 గ్రామాల్లో పైర్లు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. 45 వేల ఎకరాల్లో పత్తి, 25 వేల ఎకరాల్లో మిర్చి పైర్లను

▶ 2లో



తెనాలి మండలం హాఫ్‌పేటలో ఇంజన్ల ద్వారా పొలానికి నీరు పెట్టి పైరును కాపాడే ప్రయత్నంలో రైతులు

జిల్లాలో గత ఐదు నెలల్లో వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

నెల	అవసరం	నమోదు
జూన్	97.1	105.8
జులై	164.9	255.2
ఆగస్టు	164.7	102.7
సెప్టెంబరు	145.2	202.3
అక్టోబరు	100.2	15.8

మరోసారి ఉలిక్కిపడ్డ పల్నాడు

వైసిపి కార్యకర్త హత్యతో కలకలం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడులో రాజకీయ వాతావరణం వేడెక్కుంది. టిడిపి, వైసిపి మధ్య రాజకీయ కక్షలు భగ్గుమంటున్నాయి. అధికార పార్టీకి చెందిన కార్యకర్త హత్యతో గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో మరోసారి కలకలం చెలరేగింది. గురజాల మండంలోని జంగమ హేశ్వరపురం గ్రామానికి చెందిన కునిరెడ్డి కృష్ణారెడ్డి(34)ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మృతుడు కృష్ణారెడ్డి అదే గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి అనే అన్నదమ్ముల రెండు గ్రూపులుగా విడిపోయి గొడవలు పడుతున్నారు. గతంలో వీరిరువురిపై కౌంటర్ కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో కృష్ణారెడ్డి ప్రత్యర్థి శ్రీనివాస్‌రెడ్డి గతంలో హైదరాబాద్ వెళ్లాడని, 22న సాయంత్రం శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి కలిసి మద్దిమడుగు వెళ్లి అనంతరం స్వగ్రామం జంగమహేశ్వరపురం చేరుకున్నారు. సోమవారం రాత్రి విజయదశమి సందర్భంగా బతుకమ్మను ఊరేగిస్తుండగా కృష్ణారెడ్డిని శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి బజార్‌గుండా వెళ్తుంటే కాపు కాసి హత్య చేశారు. చిన్న కారణాలకే హత్య చేశారా? లేదా ఇంకేమైనా కుట్రకోణం ఉందా? అనేది దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

శ్రీనివాసరెడ్డి టిడిపిలో ఉన్నారు. కృష్ణారెడ్డి వైసిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కృష్ణారెడ్డి శరీరంపై 22 చోట్ల గాయాలయ్యాయి. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి కృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం మూడు బృందాలుగా గాలింపు చేపట్టారు. మంగళవారం జంగమహేశ్వరపురానికి వచ్చిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో అలర్లు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

టిడిపి పనే : ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మృతుడు కృష్ణారెడ్డి కుటుంబాన్ని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఓటమి భయంతోనే టిడిపి ఇలా హత్యా రాజకీయలకు తెరలేపుతోందని ఆరోపించారు. కృష్ణారెడ్డి వైసిపి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడని, అందుకే అతనని హత్య చేశారని అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ టిడిపి ఇలా హత్యా రాజకీయాలు చేసి ప్రజల్ని, వైసిపి నాయకులను భయపట్టేందుకు యత్నిస్తోందని, దీనిపై ఎస్పీతో మాట్లాడానని, ముఖ్యమంత్రి, డిజిపి దృష్టికి కూడా తీసుకెళతామని చెప్పారు.

రాజకీయ హత్య : ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

కృష్ణారెడ్డిది కేవలం రాజకీయ హత్యేనని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఒ ప్రకటనలో ఆరోపించారు. వైసిపిలో అత్యంత కీలకంగా చురుకుగా పనిచేసే కృష్ణారెడ్డిని టిడిపికి చెందిన వారు హతమార్చారని, ఓటమి భయంతోనే ఇలా చేశారని ఆరోపించారు.

వ్యక్తిగత వివాదాల వల్లే : యరపతినేని శ్రీనివాసరావు

కృష్ణారెడ్డి హత్య వ్యక్తిగత వివాదాల వల్ల జరిగిన హత్యని, అయితే దానిని స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హత్యకు, టిడిపికి సంబంధం లేదని తెలిపారు. 2019 వైసిపి అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గంలో 11 మంది టిడిపి కార్యకర్తలు హత్య చేయబడ్డారని, ఇందుకు ఎమ్మెల్యే కారణమని, ఇప్పుడు కూడ టిడిపి వారిపై ఆరోపణలు చేసి అక్రమ కేసులు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.



మేడికొండూరు మండలం మందపాడులో తెగులు సోకిన మిర్చి పైరు దున్నేస్తున్న కౌలురైతు ఇత్యాల బాజిబాబు

మిర్చి రైతుకు బొబ్బర భయం

- బెట్టకొస్తున్న పైరులో ఉధృతంగా వ్యాపిస్తున్న తెగులు
- మరోవైపు తామర పురుగు తెగులు వ్యాప్తి
- పెట్టుబడులైనా రావని రైతుల్లో ఆందోళన

4లో

15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

జయప్రదం కోసం సిపిఎం పిలుపు - పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు, దుగ్గిరాల

అసమానతలులేని అభివృద్ధి కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 15వ తేదీన విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజారక్షణభేరి బహిరంగ సభని జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించగా మండల కేంద్రమైన దుగ్గిరాలలోని సిపిఎం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దేశానికి ప్రమాదకరంగా బిజెపి తయారైందని, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశాన్ని రక్షించడం కోసం వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించడం అవసరమన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపి మరోవైపు ప్రజాసమస్యలపై పోరాడుతున్న వారిపై అక్రమ కేసులతో అణచివేస్తోందని అన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందని, బుల్డోజర్ రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోందని విమర్శించారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మైనార్టీలకు, దళితులకు,

▶ 2లో



పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు



తెనాలి ప్రాంతంలో ఇంజన్ల ద్వారా పైర్లకు నీటి సరఫరా

రబీ సాగుపై అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకునేందుకు రైతులు అవస్థ పడుతున్నారు. మిర్చికి అధిక పెట్టుబడి పెట్టడం వల్ల మొక్కలను బతికించుకునేందుకు చెరువులు, కుంటల్లోని నీటిని కడవలతో తీసుకువచ్చి వినియోగిస్తున్నారు. అక్టోబరులో తుపాన్లు వస్తాయని చాలామంది మెట్ట ప్రాంతంలో పత్తి, మిర్చి, ఇతర పంటలను సాగు చేయగా ఈ నెలలో ఇప్పటి వరకు వర్షం లేకపోవడం వల్ల పైర్లను బతికించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. వేసిన పైరును ఎలా కాపాడుకోవాలన్న అంశంలో ఒక్కో రైతు ఒక్కోవిధంగా ఇబ్బంది పడుతున్నారు. నిద్రహారాలు మానివేసి ఉదయాన్నే పొలం బాట పడుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం తీవ్ర రూపం దాల్చినందున రెండో పంటగా రబీ సాగులో జొన్న, మొక్కజొన్న సాగు చేయొద్దని, కేవలం మినుము, పెసర, శనగ సాగు చేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు.

సిమెంట్ అండ్ టైల్స్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతనకొండలో నూతనంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సిమెంట్ అండ్ టైల్స్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. కొమ్మూరు రాజారావు ఏర్పాటు చేసిన షాపును ఫ్యాబ్రిక్ కంపెనీ అధినేత బోడెపూడి అప్పారావు విజయదశమి పండుగ నాడు ప్రారంభించారు. మొదటిగా కొనుగోలు చేసి షాపు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి దినదిన అభివద్ధి చెంది మంచి లాభాలు చేకూరాలని ఆ దుర్గమ్మను వేడుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు ఆచారావు, సాయి, ఇబ్రహీంపట్నం మండల కోబి ఆప్షన్ మెంబర్ పఠాన్ నాగులు మీరా తదితరులు పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు భద్రత లేకుండా పోతుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వ్యవసాయానికి చేటు చేసే, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తేవడంతోపాటు వాటికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలపై దమనకాండ ప్రయోగించిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. పైగా విశాఖ ఉక్కును అమ్మటానికి కుట్ర చేస్తోందన్నారు. అయినా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి వంతపాడుతున్నాయని విమర్శించారు. స్త్రీలను నడిరోడ్డు మీద నగ్నంగా ఊరేగించిన వాళ్లకు మద్దతివ్వడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రలోని బిజెపి ప్రభుత్వం చెప్పిందానికి తలాడిస్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజలపై తీవ్ర భారాలు వేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీల రూపంలో పెనుభారం మోపిందని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని, ఆస్తి పన్ను పెంచడంతోపాటు చెత్తపన్ను వేస్తోందని తెలిపారు. నిర్బంధాలనూ ప్రయోగించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందన్నారు. నూతన విద్యావిధానం అమలులో భాగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేస్తామని వాగ్దానాన్ని ఇచ్చి జిపిఎస్ తెచ్చిందని, ఇది ఉద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. ఆశాలకు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దాలన్నీ వైసిపి ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిపిఎం పెదనందిపాడు, దుగ్గిరాల మండలాల కార్యదర్శులు డి.రమేష్‌బాబు, జె.బాలరాజు మాట్లాడుతూ ఒకటో తేదీ నుండి కాకుమాను, పెదనందిపాడు, దుగ్గిరాల మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కె.వెంకట సుబ్బారావు, సిహెచ్.యానాదులు, పి.శేషగిరిరావు, ఎం.లక్ష్మి, పి.సలీం, ఎం.రమణ, వై.బ్రమేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.చిరంజీవి పాల్గొన్నారు.



దుగ్గిరాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన సిఐలకు సవాలుగా చిలకలూరిపేట

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేటలో సిఐ పోస్టులకు కొత్తవారిని నియమించనున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడం, మంత్రి ప్రాతినిధ్యం వహిస్తుండడం, ప్రతిపక్షంలోనూ మాజీ మంత్రి ఉండడం రాజకీయంగా ఒత్తిళ్లు ఎదురుకానున్నాయి. ఈ క్రమంలో సిఐ స్థానంలో ఉన్నవారు పక్షపాతం లేకుండా, నిబద్ధతతో పని చేయాలంటే కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే పని చేసిన వారు విమర్శలను ఎదుర్కోవడంతోపాటు అధికారిక చర్యలకూ గురయ్యారు. అయితే వీరంతా గతంలో ఉన్నతాధికారులు ప్రశంసలు పొందినవారే. వీటికితోడు ట్రాఫిక్ సమస్యలు, చోరీలు, బెదిరింపులు వంటివి పోలీసు అధికారులకు సవాలుగా నిలుస్తున్నాయి.

ప్రస్తుత మంత్రి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, పక్క నియోజకర్గంలోని ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామిక వేత్తల నివాసాలు చిలకలూరిపేట పట్టణంలోనే ఉన్నాయి. పట్టణంలో నుండే జాతీయ రహదారి ఉంది. ఇటీవల స్తానిక ఇండియన్ బ్యాంక్ వద్ద కారు అద్దాలు పగులకొట్టి రూ.5 లక్షలు చోరీ జరిగింది. బార్‌లలో చోరీలు జరుగుతున్నాయి. పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లోనూ గంజాయి వినియోగం పెరిగినట్లు తెలుస్తోంది. మైనింగ్ వివాదాలు నడుస్తున్నాయి. రేషన్ బియ్య అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిషేధిత గుట్కా, ఖైనీలు విక్రయాలు జోరుగా నడుస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు తరచూ చోరీకి గురవుతున్నాయి. వీటన్నింటినీ నియంత్రంచిడంతోపాటు రాజకీయంగా ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసు అధికారులు విధులు నిర్వహిస్తారా? లేదా? అనేది నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు జిల్లా నవాబ్‌పేట రూరల్ సిఐగా పని చేస్తున్న బి.అశోక్ కుమార్‌ను చిలకలూరిపేట రూరల్ సిఐగా నియమించినట్లు తెలిసింది.



విజయవాడ

దసరా శరన్నవరాత్రుల ముగింపు చిత్రమాలిక






హోమం చేస్తున్న ఆలయ అర్చకులు



ఊరేగింపులో పాల్గొన్న ఆలయ ఇఒ, చైర్మన్



శ్రీ మహిషాసుర మర్ధిని





శ్రీ రాజరాజేశ్వరీ దేవి



దర్శనం చేసుకుంటున్న యాత్రికులు



క్యూలైన్లో యాత్రికులు, భవానీలు



ఘాట్‌లో యాత్రికుల స్నానాలు



క్యూలైన్లో వేచి ఉన్న యాత్రికులు



తలనీలాలిస్తున్న యాత్రికులు, భవానీలు

సబ్ రిజిస్ట్రార్, రవాణా శాఖ కార్యాలయాల్లో

దళారుల హవా



- **కిందిస్థాయి ఉద్యోగులకు ఎంతో కొంత ముట్టచెబుతున్న బ్రోకర్లు**
- **ఏ పని అయినా చేస్తామంటూ దండుకుంటున్న వైనం**

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్, రవాణా శాఖ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారాయి. ఆయా కార్యాలయాల్లో కొందరు బ్రోకర్ల రాజ్యం యథేశ్ఛగా కొనసాగుతోంది. దీంతో, ఆ రెండు శాఖలు అవినీతికి కేరాఫ్ గా మారాయి. ఇటీవలి కాలంలో బ్రోకర్లు విచ్చలవిడిగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతమంది కిందిస్థాయి ఉద్యోగులకు ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకునే దళారులు, ఆయా శాఖల అధికారులకు తామేమి చెబితే అదే చేస్తారని, లిటిగేషన్‌లో ఉన్న స్థిరాస్తి వ్యవహారాలు కూడా తారుమారు చేస్తామని చెబుతూ పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారు.

ఇలా వెనకేసుకునేవారు చేసేది దస్తావేజు లేఖరి పనే అయినా, వీరిలో ఒకరిద్దరు కోట్లకు పడగెత్తిన దళారులు ఉన్నారనేది బహిరంగ రహస్యమే. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోకి వెళ్లే అధికారం, అవకాశంలేని ఈ దళారులు యథేశ్ఛగా కార్యాలయంలో కలియతిరుగుతూ తమ కనుసన్నల్లోనే కార్యాలయం పనిచేస్తున్నట్లు నమ్మిస్తున్నారు. అవసరానికి అమ్ముకున్నా లేదా కొనుక్కున్న వారి నుండి అధికారులకు ముట్టజెప్పాలంటూ భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఆస్తులు అమ్మాలన్నా, కొనాలన్నా దస్తావేజు లేఖర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు దస్తావేజు లేఖర్లు తమ లిటిగేషన్ తెలివిని వినియోగించి భవిష్యత్‌లో ఏ విధమైన వివాదాలు రాకుండా దస్తావేజులు రాస్తారనేది ప్రచారం.

ఇక రవాణా శాఖలో పనులు చేయించే బ్రోకర్లది కూడా ఇదే తంతు. రూ.500 చెల్లించాల్సిన చోట రూ.5 వేల నుండి రూ.6 వేలు వసూలు చేయడం, ఏమైనా వాహనాలపై కేసులుంటే రూ.1000కు రూ.10వేల ఖర్చవుతుందని లేదంటే అధికారి ఒప్పుకోడంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ రెండు కార్యాలయాల్లోకి దళారులకు అనుమతి లేదు. అయితే చిన్న ఉద్యోగుల సహకారంతో దళారులు యథేశ్ఛగా కార్యాలయాల్లో కలియతిరుగుతున్నారు. చెయ్యి తడపకపోతే పనులు కావనే అభిప్రాయం కల్పి స్తున్నారు. అవినీతికి నిలయాలుగా ఈ కార్యాలయాలన ముద్రపడేలా చేస్తున్నారు. నేరుగా పని కావలసిన వారిని అధికారులతో కలవనివ్వకుండా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆయా కార్యాలయాల్లో దళారులను అరికట్టాల్సిన అవసరం ఉంది.



నష్టాల ఊబిలో తమలపాకు కౌలు రైతులు

- **పతనావస్థలో తమలపాకుల ధరలు**
- **స్తంభించిన తమలపాకుల ఎగుమతులు**
- **లేత తోటల్లో నల్లి,లద్దె పురుగులతో రైతు దిగాలు**
- **రూ. 20కు పడిపోయిన పొంతం తమలపాకులు ధర**



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

తమలపాకు తోటలు సాగు చేసే రైతులు, కౌలు రైతులు రైతులు సమస్యల వలయంలో చిక్కుకొని సతమతమవుతున్నారు. ప్రభుత్వం తమలపాకు తోటల సాగు, కౌలు రైతులను పూర్తిగా విస్మరించి నష్టాలపాలు చేస్తుంది. తమలపాకు తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కరువైంది. మరోవైపు మారుతున్న వాతావరణ పరిస్థితులు తమలపాకు తోటల రైతుల నడ్డి విరుస్తుంది. తమలపాకు మొక్క తోటలో నల్లి పురుగు, లద్దే పురుగు సోకి నష్టపరుస్తుంది. ప్రభుత్వం రైతులకు అందించే కౌలు రైతు కార్డులు జారీ చేయకపోవడంతో ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం , రుణ సౌకర్యం అందటం లేదు. పొన్నూరు మండలంలోని మాచవరం, ములుకుదురు, చింతలపూడి, పాత పొన్నూరు, ఆలూరు, దండమూడి, ఆరెమండ తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో తమలపాకుల తోటల సాగు పెరగటం తో పొన్నూరు పరిసర ప్రాంతాల ఎగుమతులు పూర్తిగా పడిపోయాయి. దీంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో తమలపాకుల పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. మరోవైపు తమలపాకుల ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంతం తమలపాకుల కోతకు ఏడు రూపాయలు కూలీ కాగా, పంతం తమలపాకుల ధర పది రూపాయల లకు పడిపోవడంతో రైతులు కష్టాల ఊబిలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు తమలపాకులు ఎగుమతులు పూర్తిగా పడిపోవటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. లేత తమలపాకు తోటలో నల్లి పురుగు, లబ్ది పురుగు తెగుళ్లు సోకి నష్టపరుస్తున్నాయి. దీంతో తమలపాకు తోటల రైతులకు తెగుళ్ల నివారణ చేసు కోవటానికి ఎకరానికి రూ 2 వేలు వరకు అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమలపాకు తోటలు సాగు చేసే రైతులకు కౌలు రైతు కార్డులు జారీ చేయకపోవడంతో ప్రభుత్వ పరంగా ఎలాంటి సహకారం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా తమలపాకు తోటలు సాగు చేసే రైతులకు ఎలాంటి సహకారం ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమలపాకు తోటల సాగు వాతావరణ పరి స్థితులపై ఆధారపడి ఉంది. ప్రత్యేక వాతావరణ పరి స్థితులు, ప్రకృతి వైపరీత్యాలు కారణాలతో తమలపాకు తోటలు సాగు చేసే రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తుం దని వాపోతున్నారు. తమలపాకు సాగు చేసే రైతుకు ఎక రానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని చెప్పా రు.



కౌలు రైతు కార్డులు అందజేయండి

తమలపాకు తోటలు సాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు రైతు కార్డులు అందజేయాలని కౌలు రైతు ఎమ్మెస్ రెడ్డి కోరారు. జాతీయ బ్యాంకుల్లో తమలపాకు తోటల సాగు రైతులకు జీరో వడ్డీ పై రుణ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందజేయాలని కోరారు. వాతావరణం ప్రతికూల పరిస్థితులు, ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం తమలపాకు తోటలు సాగు చేసే కౌలు రైతులకు పరిహారం అందించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ



రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రగాయాల పాలైన ఘటన మంగళ వారం జరిగింది. జిజిహెచ్ లోని అత్యవసర విభా గంలో చికిత్స పొందు తున్నాడు. యువకుడి బావ షేక్ షాజహాన్ తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు రోడ్ లోని ఆంధ్ర ముస్లిం కళాశాల సమీపంలో నివాసం ఉండే షేక్ మహమ్మద్ సిఫాతుల్ ఫహద్ (40) గుంటూరులోని విద్యానగర్‌లోని బొమ్మిడాల కంపెనీలలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఉంటాడు. పొన్నూరు రోడ్డులోని బి కన్వెన్షన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఫాహాద్ ను రాంగ్ రూట్ లో వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఫహద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా జిజిహెచ్ లో చేర్పించారు. చికిత్సను అందిస్తున్న డాక్టర్లు యువకుడు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు .

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని పిడపర్రుగ్రామం వద్ద కృష్ణానది కరకట్టపై కారు ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటన మంగళవారం నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం విజయవాడ నుండి వస్తున్న కారు వేమూరు మండలం బలిజేపల్లికి చెందిన గోపిశెట్టి శ్రీనివాసరావు దంపతులు బైక్ పై విజయవాడ వెళుతుండగా వేగంగా వస్తున్న కారు, బైక్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన 108 , కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వారిని తరలించారు.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు సిటి

లాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ది బత్తిని వీధిలో పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడిచేశారు. లాలపేట సి.ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల రాబడిన ముందస్తు సమాచారం ప్రకారం ఎస్సై విజయ్ కుమార్ సిబ్బందితో బహిరంగంగా రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 16 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి - నకరికల్లు

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం రూపెనగుంట్ల గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుండి రూ.9,470 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నారాకోడూరు జెడ్‌పి పాఠశాలకు చంద్రయాన్-3 బహుమతి

ప్రజాశక్తి - చేబ్రోలు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్

నారాకోడూరు జిల్లా పరిషత్ పాఠశాలకు సక్సెస్ ఆఫ్ చంద్రయాన్ - 3 మెమొంటోను బహుమతిగా ఇవ్వటం జరిగిందని ప్రధా నో పాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ 11వ కాన్వకేషన్ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ సాంకేతిక రంగాలపై అవగాహన పెంచేందుకు, విద్యార్థులను పరిశోధన రంగంలో బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రేరణగా చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా నారాకోడూరు పాఠశాలకు కేంద్ర ఆర్థిక శాఖ బహుమతి ఇచ్చినట్లు ఏడుకొండలు తెలిపారు. ఈ బహుమతిని అందుకునేందుకు ప్రధానోపాధ్యాయులతో పాటు పాఠశాలలో ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న, పాఠశాల అన్ని పరీక్షలలో టాపర్స్‌గా నిలిచిన, సైన్స్ పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు నీలిమ,సూర్య ప్రకాష్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అభినందించారు.



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న చిత్రం



కమాండ్ కంట్రోల్‌రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ దంపతులు

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ

కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయదశమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దంపతులు ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ భవనంపై నిర్మించిన జిల్లా ప్రధాన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్, జిల్లా నేర రికార్డుల బ్యూరో విభాగాల కార్యాలయాలను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్రరాజు (ఎఆర్), నరసరావుపేట డీఎస్పీలు మహేష్ (నరసరావుపేట), రవిచంద్ర (దిశ), ఎస్‌కె. షర్ఫుద్దీన్ (ఎస్సీ అండ్ ఎస్టీ సెల్), చిన్నికృష్ణ (ఎఆర్), సిఐటు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పండగపూటా కాన్పు

ప్రజాశక్తి - కారంపూడి

పండగ రోజు కూడా వైద్యులు, సిబ్బంది విధిల్లో పాల్గొని మహిళకు ప్రసవం చేశారు. వివరాల ప్రకారం..

మండలంలోని ఒప్పిచర్లకు చెందిన చల్లా దుర్గ అనే మహిళకు పురిటి నొప్పులు రావటంతో ఆమెను ఆ ప్రాంతానికి చెందిన ఆశా కార్యకర్త కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెచ్చారు. వెంటనే వైద్యులు ఆ మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి కాన్పు చేశారు. శిశువుకు జీరో డోస్ వ్యాక్సిన్ వేసి, తల్లిపాలు పట్టించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, బిడ్డ 3 కిలోల బరువున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ బత్తుల దుర్గారావు మాట్లాడుతూ ప్రజలకు తాము 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండరనే అపోహలకు ప్రజలు గురికావొద్దన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చిన్నారుల సందర్శన

ప్రజాశక్తి - క్రోసూరు

బాలలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని క్రోసూరు పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ యోహాను, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు అ న్నారు. అమరావతి గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌ఛార్జి సిస్టర్ విన్నరసి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాలలను మండల కేంద్రమైన క్రోసూరులోని పోలీస్‌స్టేషన్ సందర్శనకు మంగళవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారికి వివిధ అంశాలను యోహాను, దుర్గారావు, రైటర్ దాసు వివరించారు. ఫిర్యాదు చేసే విధానం, కేసు నమోదు, రికార్డుల నిర్వహణతోపాటు పోక్సో చట్టం, దిశ యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ బాలలు దేశ సంపదని, వారి సంరక్షణ అందరి బాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో సిస్టర్ మార్టినా, చిలకా బాబురావు, పవన్, బాబు, కవిత పాల్గొన్నారు.



మిర్చి రైతుకు బొబ్బర భయం

- బెట్టకొస్తున్న పైరులో ఉధృతంగా వ్యాపిస్తున్న తెగులు
- మరోవైపు తామర పురుగు తెగులు వ్యాప్తి
- పెట్టుబడులైనా రావని రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒకవైపు ఎండిపోతున్న మిర్చి పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకు రూ.25-30 వేల వరకూ వెచ్చించి నీటిని ట్యాంకర్ల ద్వారా పెట్టుకుంటున్నారు. అయినా పంట చేతికి రావడం కష్టమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. బొబ్బర తెగులు, తామర పురుగు ఉధృతి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బొబ్బర తెగులు సోకిన మొక్క ఎదుగుదల లోపించడంతో పాటు వేగంగా ఒక మొక్క నుండి మరో మొక్కకు వ్యాపిస్తుందని, ఈ తెగులు సోకిన మొక్కలను గుర్తిస్తే వెంటనే పీకేసి తగలబెట్టాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గతేడాది పల్నాడు జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవ్వగా ఈ ఏడాది ఇప్పటి వరకు 32 వేల ఎకరాల్లోనే సాగైంది. వీటిల్లో నాలుగైదు వేల ఎకరాలకు బోర్ల ద్వారా నీటి సదుపాయం ఉండగా మిగతా పొలాలన్నీ కాల్వలు, వర్షం ఆధారంగా సాగైనవే. ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పూర్తిగా నష్టపోగా ఆ పొలాలను దున్ని కొంతమంది మిర్చి సాగు చేశారు. మిర్చికి ఇప్పుడు తామర పురుగు, బొబ్బర తెగులు సోకడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. బెట్ట పరిస్థితుల్లో ఈ తెగులు మరింత ఉధృతంగా వ్యాపిస్తుందని రైతులు కంగారు పడుతున్నారు. పోనీ ప్రభుత్వ సాయం, బీమా పరిహారం ఏమైనా అందుతుందా? అంటే అదీలేదు. ప్రభుత్వం కూడా నీటిపారుదల భూమి, వర్షాధార భూమి అనే సాకులతో బీమా పథకానికి రైతులను దూరం చేస్తోంది. ఒకవైపు నీటి ఎద్దడి మరోవైపు తెగుళ్లతో పైరు ఎదగకుండా పూత, పిందె రాలిపోవడంతో మిర్చిపంటపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ఇప్పటికే నీటి ఎదుడి ఎదుర్కొంటున్న మిర్చిని కాపాడుకోవడానికి రైతులు అధిక ఖర్చును భరించి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఆరుతడి పంటలకు నీరిస్తామనే ప్రభుత్వ ప్రకటనతో కొద్ది రోజుల్లో అయినా పైర్లకు నీరు వస్తుందని కదా? అనే ఉద్దేశంతో రైతులు ఇప్పుడు నీటి కొనుగోలుకు సిద్ధమయ్యారు. అయితే పంటకాలం పూర్తయ్యే వరకూ నీటిని కొనుగోలు చేయాల్సి రావడం అంటే అది తమవల్ల అయ్యే పని కాదని రైతులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసి మరీ ఎకరాకు రూ.80 వేలు నుండి రూ.లక్ష వరకు పెట్టిన పెట్టుబడుల్లో ఒక్క రూపాయి కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదని, తీవ్ర ఆర్థిక నష్టాలను చవి చూస్తున్నామని, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని, మిర్చి పొలాలను వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



కేతిముక్కల అగ్రహారం గ్రామంలో బొబ్బర తెగులు సోకి ముడత ఏర్పడ్డ మిర్చి పొలం



బొబ్బర తెగులు సోకిన మొక్క

గతేడాది వరుస తెగుళ్లతో నష్టపోయిన రైతులు అనేకమంది అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందిన సాయం ఏమీ లేదు. అయినా రైతులు ధైర్యం కూడగట్టుకుని మళ్లీ సాగు చేపట్టగా ఈసారి కూడా నీటి ఎద్దడి, తెగుళ్ల రూపంలో నష్టాలు చుట్టుముట్టాయి.



బోర్ల నుండి కూడా చుక్కనీరు రావడం లేదు



ఆరుతడి పంటలకు నీరిస్తారనే ఆశతో నాకున్న రెండెకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాను. ఎకరా రూ.20 వేలు చొప్పున ముందుగానే కౌలు చెల్లించి మొత్తం నాలుగెకరాల్లో మిర్చి సాగు చేశాను. వర్షాల్లేవు. బోర్లలో నీరు కూడా రావడం లేదు. ఇప్పటికి ఎకరాకు రూ.70 వేలు చొప్పున నాలుగు ఎకరాలకు రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పురుగు మందు పిచికారి చేయాలన్నా గ్రామం నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిందే. దీనికితోడు పైరుకు బొబ్బర తెగులు వచ్చింది. తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

ఎరుగుల లక్ష్మారెడ్డి, రైతు, బొల్లాపల్లి.

నీటి తడులు ఇస్తేనే నష్టాలు తప్పేది



కొద్దిపాటి సొంత పొలంతో పాటు 30 ఎకరాలకు పైగా పొలం కౌలుకు తీసుకొని 18 ఏళ్లుగా పత్తి, మిర్చి, శనగ, వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాను. మిర్చిలో ఆరేళ్లుగా తామర పురుగు వల్ల నష్టపోతున్నాను. ఈ ఏడాది వర్షాభావం ఉన్నా ఆరుతడి పంటలు వేసుకోవచ్చనే ప్రభుత్వ ప్రకటనతో పదెకరాలకు ముందస్తు కౌలు చెల్లించి మిర్చి సాగు చేశాను. ప్రస్తుతం పైరు బెట్టకు రావడంతోపాటు బొబ్బర తెగులు, తామర పురుగు ఉధృతంగా వ్యాపించింది. ఇప్పటికి ఎకరాకు రూ.60 వేలు వరకు పెట్టుబడి అయ్యింది. ప్రస్తుతం నీటి తడి ఇవ్వకపోతే తోటను దున్నేసుకోవాల్సిందే. ఐదారు నీటి తడులు అందించి తెగుళ్లను నివారించగలిగితే పెట్టుబడులు కొంతవరకైనా వస్తాయి. లేకుంటే నష్టాల్లో కూరుకుపోవడమే.

కోండ్రు పిచ్చారావు, రైతు, కుంకలగుంట, నకరికల్లు మండలం.

రైతులకు బీమా పరిహారం ఇచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎండిపోతున్న పైర్లకు సాగర్ జలాలను మోటార్ల ద్వారా అయినా అందించి కాపాడాలి. తెగుళ్ల బారిన పడ్డ పొలాలను వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించి పంట నష్టం అంచనా వేసి పరిహారం అందేలా చూడాలి. బోర్లు, బావులు కింద మోటార్ల ద్వారా సాగవుతున్న పొలాలకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాలి. సాగుదార్లలో 70 శాతం మంది కౌలురైతులే. వీరి కోసం ప్రత్యేక నిధిని కేటాయించి నష్టపరిహారం చెల్లించాలి. లేకుంటే వీరంతా అప్పుల నుండి బయటపడలేక ఆర్థికంగా చితికిపోవడంతోపాటు ఆ ఇబ్బందుల నుండి బయటపడలేక సాగుకు వెనకడుగేసే పరిస్థితి వస్తుంది. రైతులను, కౌల్దార్లను ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం.





ఏపూరి గోపాలరావు, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి
కె.రామారావు, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు

నేడు దుగ్గిరాల ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా

హైలెవల్ ఛానల్‌కు తక్షణమే నిధులు కేటాయించి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దుగ్గిరాల ఇరిగేషన్ కార్యాలయం వద్ద బుధవారం అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

దుగ్గిరాల డీఈ ఆఫీస్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని బాబిరెడ్డి డొంక అడవి, ఉప్పలగుంట పొలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ వర్షాలు లేక కాలువల ద్వారా సరిపడా నీరు ప్రభుత్వం వదలక పోవడంతో పంటలు ఎండిపోతు న్నాయని, ఇంజన్ల ద్వారా పొలాలకు నీరు పెట్టాలంటే చాలా ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాలవలు సరిగ్గా లేక గుర్రపు డెక్క, తూటకాడల వంటివి పెరిగి, లాకులు తుప్పు పట్టి మొత్తం ఇరిగేషన్ వ్యవస్థ అధ్వానంగా తయారందని, దీనివల్ల రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉప్పుల గుంటలో నీళ్లు లేక 800 ఎకరాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, పొట్టకు వచ్చినటువంటి వరి పొలాలకు ఇప్పటికే పెద్ద మొత్తంలో రైతులు పెట్టుబడి



దుగ్గిరాలలో

పెట్టి ఉన్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం హై లెవెల్ ఛానల్ ద్వారా పొలాలకు సరిపడా నీరు విడుదల చేయాలని దుగ్గిరాలలో జరిగే ధర్నాలో రైతులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు రాంరెడ్డి, శివాజీ, అప్పి రెడ్డి, అన్నపురెడ్డి, వెంకటరెడ్డి, నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

హైలెవల్ ఛానల్ పోరాట కమిటీ కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి కమిటీ కోకన్వీనర్ యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావుతో కలిసి మంగళవారం ఖాజిపేట, హాఫ్‌పేట, తంగెళ్ళమూడి, శేకూరు, కొలకలూరు గ్రామాల్లో హైలెవల్ ఛానల్ పరిధిలో ఎండిపోయిన వరిని ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మీడియాతో



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

మాట్లాడుతూ కౌలు రైతులు ఎకరానికి ముందుగానే రూ.20వేల వరకు కౌలు చెల్లించి, మరో 20వేల వరకూ పంటకు పెట్టుబడులు పెట్టి ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీరు అందక పొలాలు ఎండిపోతుంటే రైతుల కంట కన్నీరే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి, వెంటనే హైలెవల్ ఛానల్ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, త్వరితగతిని సాగునీరు అందించాలని కోరుతూ ఉదయం పది గంటలకు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టినట్లు చెప్పారు. రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట జి.నరశింహరావు, ఎస్.జయరాజు, డి.నాగరాజు, కె.నరశింహారావు, టి.శ్రీనివాసరావు, కె.మరియదాసు, యోబు పాల్గొన్నారు.

జనరిక్ మందులు ఉపయోగించాలి

లక్ష్మీ గణేష్ జనరిక్ మందుల షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి



స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ గణేష్ జనరిక్ మందుల షాపును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. విజయదశమి రోజున షాపు ప్రారంభోత్సవం సంద్భంగా నిర్వహి ంచిన పూజల్లో ఆయన పాల్గొ న్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనరిక్ మందులు సాధారణంగా లభించే మందుల ధరకన్నా తక్కువ ధరకే లభిస్తా యన్నారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన మందులు, జనరిక్ మందులకు బ్రాండ్‌లో తప్ప మందుల మోతాదులో తేడా ఏమీ లేదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, షాపు నిర్వాహకులు ఉన్నారు.



టిడిపి కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం రాత్రి జగనాసుర బొమ్మను పార్టీ కార్యకర్తలు దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, పార్టీ జిల్లా యువత అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ పాల్గొన్నారు. ఈ బొమ్మ దహనం జరుగుతుండగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, టిడిపికార్యకర్తలకు మధ్య పెనుగులాట జరిగింది. సగం కాలిన కట్ అవుట్‌ను లాక్కుని ఠాణాకు తరలిస్తుండగా తెలుగు యువత నేతలు కాగడాలతో విధి చివర వరకు వెంబడించగా కాసేపు ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాస్టర్, జిల్లా నాయకులు కంచేటి శివరామయ్య, నాయుడు ఒంకార్, షేక్ ఫిరోజ్, షేక్ నాగుల్ మీరా బాబు ,ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్,అధికార ప్రతినిధి షేక్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో అసమ్మతి సెగ

ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకున్న వైస్ ఎంపిపి గ్రూపు

ఇన్‌ఛార్జి ఎంపిపి నియామకంలో భగ్గుమన్న విభేదాలు


ఎమ్మెల్యే సమాధానం చెప్పకుంటే బస్సుయాత్రను అడ్డుకుంటామని హెచ్చరిక

ప్రజాశక్తి-తెనాలి

అధికార పార్టీలో అసమ్మతి సెగ రాజుకుంటోంది. ఇన్‌చార్జి ఎంపిపి నియామకంలో నిబంధనలకు తిలోదకాలివ్వటమే కాకుండా, వైస్ ఎంపిపికి సమాచారం లేకపోవటాన్ని ఆమె వర్గం తీవ్రంగా నిరసించింది. రూరల్ గ్రామం కొలకలూరు కూడలిలో ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. మాదిగ సామాజిక తరగతికి నియోజకవర్గంలో అన్యాయం జరుగుతోందంటూ కదం తొక్కారు. రూరల్ గ్రామం కొలకలూరులో మంగళవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన చెన్నుబోయిన శ్రీనివాసరావు, ముందస్తు ఒప్పందం ప్రకారం మరొకరికి అవకాశం కల్పించాలన్న ఎమ్మెల్యే నిర్ణయం మేరకు కొద్ది రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తిరిగి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు వైస్ ఎంపిపికి ఇన్‌చార్జి ఎంపిపిగా బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. వాస్తవానికి వైసిపి ప్రభుత్వంలో ఇరువుకి మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా అవకాశం ఉన్న నేపథ్యంలో కొలకలూరు-3 సెగ్మెంట్ నుంచి ఎంపిటిసిగా ఎన్నికైన కోడూరి స్వప్న మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-1గా ఉన్నారు. అలాగే బుర్రిపాలెం ఎంపిటిసి కె.రమాదేవి ఇటీవలే మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-2గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎంపిపిగా మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-1గా సీనియర్ అయిన కోడూరి స్వప్నకు అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా కాపు సామాజిక వర్గానికి చెందిన వైస్‌ఎంపిపి-2 పి.రమాదేవిని ఇన్‌చార్జి ఎంపిపిగా నియమంచటంపై కోడూరి స్వప్న, ఆమె భర్త రమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు భగ్గుమన్నారు. ఈనెల 26న నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో పాటు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పలువురు పార్టీ నాయకులు మంగళవారం రూరల్ గ్రామాల్లో పర్యటించారు. కొలకలూరు కూడలికి చేరుకున్న ఎమ్మెల్యే వాహనశ్రేణిని కోడూరి స్వప్న అనుచరులు, పలువురు పార్టీ నాయకులు అడ్డుకున్నారు. స్వప్నకు ఇన్‌చార్జి ఎంపిపిగా ఎందుకు అవకాశం కల్పించలేదని, కనీసం మరొకరికి అవకాశం కల్పిస్తున్న సమాచారం కాని, కొలకలూరు పర్యటనకు వస్తున్న సమాచారం కాని ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యేని నిలదీశారు. ఎమ్మెల్యే, డొక్కా ఇరువురూ వాహనాలు దిగి మాట్లాడే ప్రయత్నం చేశారు. డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు కూడా జరిగిన విషయాన్ని స్వప్న భర్త, పలువురు నాయకులు వివరించారు. ఈలోగా పెద్దఎత్తున నాయకులు అక్కడికి చేరుకోవటంతో రోడ్డుపై ట్రాఫిక్ కూడా స్థంభించి పోయింది. పలువురు నాయకులు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. పరిస్థితి చేయిదాటుతుందన్న భావనతో డొక్కా చొరవతో ఎమ్మెల్యేను ముందు అక్కడి నుంచి పంపించి వేశారు. దీనిపై స్వప్న భర్త రమేష్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని



కొలకలూరు కూడలిలో ఎమ్మెల్యే వాహనాలను అడ్డుకున్న వైసిపి నాయకులు



భారీగా నిలిచిపోయిన వాహనాలు

పనిచేస్తున్న వారిని ఎమ్మెల్యే అవమాన పరిచారని, నాలుగు ఎంపిటిసి స్థానాలు గెలిస్తే ఎంపిపి అవకాశం కల్పిస్తానన్న హామీని నిలబెట్టుకోకపోగా, ఇప్పుడు ఇన్‌చార్జి ఎంపిపిగా మాదిగ సామాజిక వర్గానికి వచ్చిన అవకాశాన్ని కూడా పక్కదారి పట్టించి అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ రాజీనామా చేస్తే సీనియర్‌గా ఉన్న వైస్‌చైర్మన్-1కు ఇన్‌చార్జి చైర్మన్‌గా అవకాశం కల్పించిన విషయం గుర్తు చేశారు. అదే దామాషా ప్రకారం స్వప్నకు ఎందుకు అవకాశం ఇవ్వలేదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని, లేని పక్షంలో బస్సుయాత్రను కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు. పార్టీ నాయకులు కె.పాపారావు మాట్లాడుతూ పార్టీకి తాము వ్యతిరేకం కాదని, ఎమ్మెల్యే అనుచిత నిర్ణయాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. మాదిగలకు అన్యాయం చేయటాన్ని సహించబోమన్నారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబుజగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, విగ్రహాలకు నల్లరిబ్బన్లతో గంతలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిర్రావూరులో జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో సోమవారం జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. నూతన పార్టీ కార్యాలయాన్ని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, చిర్రావూరు గ్రామ అధ్యక్షులు అంకం ఖాళీ కృష్ణ, గ్రామ ఉపాధ్యక్షులు పోకల శివయ్య, ప్రధాన కార్యదర్శి మేడూరి ప్రసాద్, పరిమిశెట్టి సురేష్, ఒకల సుధీర్, బచ్చు హరీష్ పాల్గొన్నారు.

26న వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర

తెనాలిని కార్పొరేషన్ చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా : వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పురపాలక సంఘాన్ని కార్పొరేషన్ స్థాయికి పెంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ దృష్టికి తీసుకువెళ్తామని వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. ఈనెల 26న తెనాలిలో ప్రారంభం కానున్న వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన తెనాలి వచ్చారు. స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ తో కలిసి మంగళవారం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుర వేదిక వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైసిపి బస్సు యాత్రలు సామాజిక సాధికార యాత్ర పేరుతో మూడు ప్రాంతాల్లో ఒకేసారి ప్రారంభం చేస్తున్నా మన్నారు. ఉత్తరాంధ్రలో ఇచ్చాపురం, కోస్తాంధ్రలో తెనాలి, రాయలసీమలో సింగనమల నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నాలుగున్నరేళ్లలో లో జరిగిన అభివద్ధి సంక్షేమాలపై ప్రచారం చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమంపై ప్రచారం చేస్తామన్నారు. ప్రతిరోజు మూడు ప్రాంతాల్లోనూ మూడు సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో 175 నియోజకవర్గాల ప్రజలతో మమేకమవుతామన్నారు. గెలుపే లక్ష్యంగా బస్సు యాత్ర చేపట్టినట్లు తెలియజేసారు. తెనాలి నియోజకవర్గం లో వైసీపీ పాలనలో జరిగిన అభివద్ధిపై ఎమ్మెల్యేతో సమీక్షించామని, తెనాలి పురపాలక సంఘాన్ని కార్పోరేషన్ స్థాయికి అప్గ్రేడ్ చేయాలన్న ఆలోచన ఉందన్నారు ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి కూడా తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. బస్సు యాత్రను పార్టీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు ఆయన వెంట ఎమ్మెల్యేతో పాటు ఇంచార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీటీసీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎ కిరణ్ కుమార్ ,బి దుర్గ, కె.దేవ సహాయం పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

కరువు పరిస్థితులు ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - క్రోసూరు

వర్షాభావ పరిస్థితుల వలన ఏర్పడనున్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సన్నద్ధం కావాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. మండలంలోని పెరికపాడులో మంగళవారం సిపిఎం గ్రామ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముందుగా ఈ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రజల స్థితి తగతుల గురించి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రవి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. వరి సాగు చేసే ప్రాంతంలో సాగర్ కాలువ నీరు రాక వరి సాగు ఆగిపోయిందని, మెట్ట వ్యవసాయం సాగు చేసే ప్రాంతంలో కూడా పంటలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, దీనివల్ల కరువు వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవడానికి ఉపాధి హామీ పనులను కుటుంబానికి 150 రోజులకు పెంచి పనులు ప్రారంభించడానికి సన్నద్ధం కావాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యా వసర సరుకులు పంపిణీకి ప్రభుత్వం ప్రణాళికలు తయా రు చేయాలని కోరారు. వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారని, 9 గంటలు ఇస్తే బోర్లు, బావుల వద్ద రైతులు సాగుచేసిన పంటలను కాపాడు కోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, మండల నాయకులు ఎ.ఆంజ నేయులు, శాఖ కార్యదర్శి ఎం.పౌలు, డి.నటరాజ్, జె. పేతురు, ఎస్.దిలీప్, జె.సుబ్బు, జె.కిరణ్ పాల్గొన్నారు.


పెరికపాడులో నిర్వహిస్తున్న సిపిఎం గ్రామ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

356 పనులు గుర్తించాం ఎపిఒ జయచంద్ర

ప్రజాశక్తి - రెంటచింతల

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024 - 25 సంవత్సరాలకు గాను మండలంలోని 11 గ్రామాల నుంచి నేటి వరకు 356 పనులు గుర్తించినట్లు ఏపీవో జయచంద్ర తెలిపారు మొత్తం 11,056 మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారని వారందరికీ రోజులకు 272 రూపాయలు దక్కేల పని దినాలు కల్పిస్తాలమన్నారు ప్రధానంగా సాగునీటి కాలువల మరమ్మతులు ఉంటాయన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - రెంటచింతల

దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బాలబాలికలకు నిర్వహించిన పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేసినట్లు గిరిజన నేత వడితే భీమ్లా నాయక్,శంకర్ నాయక్ తెలిపారు మొత్తం 25 మంది పాటల పోటీల్లో పాల్గొనగా 12 మంది పాడడంతో మంచి ప్రావీణ్యం కనిపించారన్నారు.

నేటి నుండి జనసేన-టిడిపి సంకీర్ణ ప్రభుత్వ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలో జనసేన -టిడిపి సంకీర్ణ ప్రభుత్వ సంకల్ప యాత్ర చేస్తున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడి నుండి బుధవారం యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. సత్తెనపల్లి మండలం గుజ్జర్లపూడి ప్రస న్నాంజనేయ దేవాలయంలోను ఇస్సప్పాలెం అమ్మవారి ఆలయంలో ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఎఎల్‌పిహెచ్ ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు, కౌన్సిలర్ ఆర్. సుమన్ పాల్గొన్నారు.

7న మహాసభను జయం ప్రదం చేయండి

ప్రజాశక్తి - రెంటచింతల

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా నవంబర్ 7న హైదరాబాదులో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా నాయకులు గడిపర్తి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని మంచికల్లులో మంగళవారంమహాజన సోషలిస్టు పార్టీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలందరూ ఈ మహాసభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు

11న మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎఐటియుసి కార్యాలయంలో వచ్చే నెల 11 న జరగనున్న ఎఐటియుసి పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా కన్వీనర్ కాసా రాంబాబు పిలుపు నిచ్చారు. స్థానిక ఎఐటియుస కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా ఎఐటియుసి కార్యాలయం నుండి ర్యాలీ అనంతరం స్థానిక ఎన్జీవో హోమ్‌లో సభ జరుగుతుందని చెప్పారు. రానున్న కాలంలో కార్మిక వర్గాన్ని ఒక తాటి మీద తీసుకొచ్చి పోరాటం చేస్తామన్నారు. మహాసభలకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ప్రముఖ న్యాయవాది సీజే ప్రతాప్ తదితరులు హాజరై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో ఎఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, జేవియర్ పాల్గొన్నారు.

నిర్మాణపు పనుల పరిశీలన

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్ల లో మంగళవారం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన శాసనసభ్యులు శ్రీనివాస రెడ్డికి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని బొడ్రాయి సెంటర్‌లో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం ఎదుట నిర్మిస్తున్న టిటిడి కళ్యాణ మండపాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న కళ్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తామని, అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు.


కళ్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

అనంతరం గ్రామంలో వైసిపి నాయకులు గంగిరెడ్డి సాంబశివారెడ్డి నూతనంగా నిర్మించిన పల్నాడు రెస్టారెంట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు. పి. చక్రారెడ్డి, జి.చినకోటిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె. శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు పి.రవీంద్రబాబు, ఎ. పున్నారెడ్డి, సిహెచ్ సంజీవరెడ్డి, పి.రమణారెడ్డి,పి. మల్లి కార్జునరెడ్డి పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

రోగుల అవసరాల నిమిత్తం ఏరియా వైద్యశాలలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని అభివృద్ధి కమిటి డైరెక్టర్ కొత్త రామకృష్ణ సూచించారు. మంగళవారం ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు సంఖ్య పెరిగినట్లు చెప్పారు. ముఖ్యంగా ప్రసవం సమయంలో రక్తం అవసరాలు ఎక్కువగా వుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా, డెంగీ జ్వరాలు వచ్చిన వారికి కూడా రక్తం అవసరం ఉంటుందని చెప్పారు.దీంతో, రోగులు ఎంతో వ్యయాప్రయాసలకుగురికావాల్సివస్తోందని అన్నారు. రోగుల అవసరాల నిమిత్తం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు మంత్రి అంబటి రాంబాబు సూచన మేరకు వైద్య శాఖ కమిషనర్ కు లిఖిత పూర్వకంగా ఒక అభ్యర్థన అందజేయాలని కమిటి తీర్మానం చేసింది. ప్రస్తుతం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఉన్నప్పటికీ రోగుల అవసరాలు తీరటంలేదని చెప్పారు. రోగుల తక్షణ అవసరాల నిమిత్తం త్వరలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో ప్రధాన వైద్యులు లక్ష్మణరావు ఉన్నారు.

27న టిడిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-తెనాలి

ఈ నెల 27న తెనాలిలో టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు మంగళవారం తెలిపారు. స్థానిక నాజరుపేటలోని ఎన్ వి ఆర్ కన్వెన్షన్ లో ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ సమావేశంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు.

'తాగునీరు రాదు.. మురుగునీరు పోదు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక 52 ఎకరాల టిడ్కో గృహ సముదాయం సమస్యలమయంగా మారిందని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దుమాల ప్రసన్నాంజనేయులు, పల్నాడు జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ విమర్శించారు. స్థానికంగా ఉన్న 52 ఏకరాల్లో మంగళవారం వారు సందర్శించారు. ఈ సందదర్భంగా వారు మాట్లాడుతూ గృహ సముదాయాల్లో తాగునీరు రావడం లేదని, ఒకవేళ వచ్చినా రంగుమారిన నీరు వస్తోందని అన్నారు. మురుగునీరు పోయే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ విఫలమైన కారణంగా మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. పురపాలక సంఘ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని, ప్రజా ఆరోగ్యా న్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

నివాస గృహాల మధ్య ఉన్న పెద్ద పెద్ద చెట్లు, ముళ్ళ చెట్లు ఉండటంతో అడవిని తలపిస్తోందని, విషసర్పాలు సంచరిస్తున్నాయని, ఇప్పటికే ఇద్దరు పాముకాటుకు గురైన విషయాన్ని స్థానికులు, యువజన కాంగ్రెస్ నాయకులకు చెప్పారని అన్నారు.


టిడ్కో గృహ సముదాయంలో మురుగుటి వద్ద ముక్కులు మూసుకున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ప్రత్యేక శానిటరీ సిబ్బందిని నియమించాలని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ఫలితం లేదని అన్నారు. స్థానిక ప్రజలతో కలిసి యువజన కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం త్వరలో చేపట్టనున్నట్లు చెప్పారు. సందర్శించిన వారిలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎ.ఈశ్వర్, కారుచోల స్వప్న కుమార్, సిహెచ్ నాగరాజు, జె.రాజశేఖర్ రెడ్డి, షేక్ మహబూబ్ సుభాని, వి.సుధాకర్ పాల్గొన్నారు.

టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పోలీస్ యంత్రంగాం రాజ్యాంగేతర శక్తిగా పని చేస్తోందని టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య ఆరోపించారు. సత్తెనపల్లి ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్షాల పట్ల పోలీస్ తీరు అక్షేపణీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.ఆదినారాయణ, డి. శ్రీనివాసరావు, జి.వసంతరావు, బి.సంగీతరావు, ఎ.జయరాం యు.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. **తాడేపల్లి రూరల్:** అరాచక పాలన సాగిస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి సైకో పాలన పోవాలని తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్య క్షులు అమరా సుబ్బారావు అన్నారు. సోమవారం రాత్రి దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని, ఎంటిఎంసి


కుంచనపలి టిడిపికార్యాలయం వద్ద..

పరిధిలోని కుంచనపల్లి తెలుగుదేశం మండల కార్యాలయం వద్ద, తెలుగుదేశం శ్రేణులు, సైకో పోవాలి అంటూ కరపత్రాలను మంటలలో దహనం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 'దేశం చేస్తోంది రావణాసుర దహనం-మనం చేద్దాం జగనాసుర దహనం' అనే తెలుగుదేశం పార్టీ పిలుపులో భాగంగా టిడిపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూపతి సుబ్బారావు, పెనుమాక మల్లికార్జునరావు, తెలుగు మహిళా నాయకురాలు దాశెట్టి అరుణ, కొల్లూరు సుజాత తదితరులు పాల్గొన్నారు. **పెదకాకాని రూరల్:** పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్గర, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు,ఐజేయం రైన్ ట్రీ పార్క్ ఆవరణలో సోమవారం జగనాసుర దహనం కంపత్రాలను దహనం చేశారు. **దుగ్గిరాల:** మండల కేంద్రం దుగ్గిరాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి 'సైకో పోవాలి' అనే నినాదంతో జగనాసుర దహనం పేరిట కరపత్రాలను తగలబెట్టారు. శివాలయం సెంటర్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ పోలీసుల ఆంక్షలతో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు మాట్లాడారు.


సత్తెనపల్లిలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 25 అక్టోబర్ 2023

కోడి పందేల స్థావరాలపై దాడులు

పోలీసుల అదుపులో ఐదుగురు

ప్రజాశక్తి- తాడేపల్లి

కృష్ణానదీ తీర ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్న సమాచారం మేరకు పోలీసుల దాడులు నిర్వహించారు. ఐదుగురికి అదుపులో తీసుకుని, వారి వద్ద నుండి రూ.66,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్, జంతు హింస నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై గిరిబాబు ఆధ్వ ర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట, కోడి పం దేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్టోర్‌ను పారంభిస్తున్న డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి , ఎమ్మెల్యే ఎ.శివకుమార్

శ్రేష్ట స్మార్ట్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లిపర

రైతులు పండించిన సేంద్రీయ పంటలను ఆహార ఉత్ప త్తులుగా చేసి ప్రజలకు విక్రయించడం శుభపరిణామం అని ఆచార్య ఎన్‌జి రంగావ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సం చాలకులు డాక్టర్ అన్యం సుబ్బరామిరెడ్డి అన్నారు. మంగళ వారం మండల కేంద్రమైన కొలిపరలో శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రేష్ట స్మార్ట్ స్టోర్‌ను శాసనసభ్యులు అన్నా బత్తుని శివకుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపరలో 300 మంది రైతులు సంఘటితంగా ఏర్పడి సంస్థను ఏర్పాటు చేసుకొని పండించిన పంట లను ఆహార ఉత్పత్తులుగా తయారు చేసుకొని వాటిని నేరుగా వినియోగదారులకు అమ్మడం ద్వారా ఆదాయం పొందు తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సం ఘటితంగా ఏర్పడి సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు సబ్సి డీపై రుణాలను ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిసోందని చెప్పారు. కార్యక్రమంలో శ్రేష్ట చైర్మన్ ఎన్.కుటుంబరెడ్డి, ఎన్. నరేంద్రారెడ్డి, కె.వీరారెడ్డి, యు.సాంబిరెడ్డి పాల్గొన్నారు.

నగర ప్రముఖులు మాగంటి సుబ్రహ్మణ్యం కన్నుమూత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



నగర ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్త లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం (89) వయోభారంతో లబ్బీపేటలోని వారి నివాసంలో సోమవారం రాత్రి మృతిచెందారు. సుబ్రహ్మణ్యం 1934లో జన్మించారు. 1954నుండి విజయవాడ ఆటోమొబైల్ వ్యాపార రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను ఏర్పాటుచేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యం పార్థీవ దేహాన్ని నగర సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు, నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, తొండెపు హనుమంతరావు పలువరు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు

జనసేన నాయకులు చందు శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - కొల్లిపర

జనసేన నాయకులు చందు శ్రీనివాసరావు (చంటి) మృతి పార్టీకి తీరని లోటని జనసేన రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు మంగళవారం అత్తోట గ్రామానికి చెందిన జనసేన నాయకులు చందు శ్రీని వాస రావు మృతి పట్ల నాదెండ్ల మనోహర్ సంతాపం తెలిపారు. చంటి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నట్లు మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహ సము దాయంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగు పారుదల లేక దోమలు పెరిగి ప్రజలు అనా తరోగ్యానికి గురవుతున్నారు. టిడ్కో గృహాల్లోకి లబ్ధిదారులు వెళ్లి ఏడాది దాటినా, మౌలిక వసతుల కల్పన మాత్రం జరగ లేదు. కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం వపి స్తున్నారు. ఇప్పటికే నీటి కొరత తీవ్రం. డ్రైనేజీ వ్యవస్థ అస్త వ్యస్తంగా ఉండటంతో మురుగునీరు పారుదల లేక దోమలు విప రీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో అక్కడ నివసించే కుటుంబాల వాళ్లు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను పరి ష్కరించాలని కార్పొరేషన్ అధికారుల దృష్టికి అనేక పర్యాయాలు వినతిపత్రాల ద్వారా తెలియజేసినప్పటికీ ఫలితం లేదని ప్రజలు వాపో తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి మురుగుపారుదలకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మంగళగిరిలోని టిడ్కో గృహ సముదాయంలో..



మల్లేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్ దంపతులు దేవస్థానాన్ని మంగళవారం విచ్చేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అర్చకస్వాములు, వేదపండితులుస్వాగతము పలికినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. అనంతరం న్యాయమూర్తి దంపతులకు స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు

అధికసంఖ్యలో సందర్శకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వ రస్వామి వారి దేవస్థానంలో విజయదశమిని పుర స్కరించుకొని మంగళవారం పుష్పశయ్య అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దేవస్థానం ఈవో ఎ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.పట్టణ పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎన్.లక్ష్మీ రాధిక, మురళీమోహన్ కృష్ణ దంపతులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు కె.ముసలారెడ్డి, రేఖా వకుళాదేవి, కె.వెంకట బాబురావు, ఎ.వెంకటేశ్వర్లుపాల్గొన్నారు. మంగళగిరి స్టేషన్ రోడ్డు లోని శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడువేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కాలారి సుబ్బారావు, నిర్వాహరాలు కాలారి వసంత, భక్త బందం ప్రతినిధులు కదం రాంబాబు, మన్నెం రమేష్ బాబు, బండి నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి శ్రీ పోలేరమ్మ ఆల యంలో మంగళవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం సుమారు 1200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి బత్తుల రాంబాబు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.




26న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కష్ణ ఎన్టీయార్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అక్టోబర్ 26వ తేదీ అనగా గురువారం నాడు విజయవాడలోని ఫార్చ్యూన్ మురళీ హోటల్ సమీపంలోని పద్మజ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అవరణలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ జాబ్‌మేళాలో వరుణ్ మారుతీ, పద్మజ సుజుకీ, వరుణ్ బజాజ్ వంటి కంపెనీల్లో సర్వీస్ అడ్వైసర్, అసిస్టెంట్ టెక్నీషియన్, సేల్స్ అడ్వైసర్ డెంటర్స్, పెంటర్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని పదోవ తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానిక్స్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 27 సంవత్సారాల లోపు నిరుద్యోగులు పూర్తి బయోడేటా, ధవపత్రాలు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకి రూ.11 వేల నుండి రూ.15 వేల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.http://www.ncs.gov.in వెబ్సైట్‌లో వివరాలను నమోదు చేసుకోగలరని తెలిపారు. ఇతర వివరాలకు 8142416211 నెంబర్‌లో సంప్రదించవచ్చని చెప్పారు.

ఐడిబిఎల్‌లో లాభాల నమోదు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సెప్టెంబరు త్రైమాసికంలో ఐడిబిఐ బ్యాంకు లాభాలను సాధించిందని బ్యాంకు రీజనల్ ఇన్‌ఛార్జి ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు రూ.1323 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసినట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.828 కోట్లతో పోలిస్తే ఇది 60 శాతం అధికమని తెలిపారు. మొత్తం ఆదాయం రూ.6006 కోట్ల నుండి రూ.6924 కోట్లకు చేరిందని తెలిపారు. రానున్న కాలంలో ఇంకా మెరుగైన అవకాశాలను బ్యాంకు ఖాతాదారులకు అందించనున్నట్లు తెలిపారు.



మృతురాలి అంత్యక్రియలకు నగదును అందిస్తున్న సర్పంచ్

పార్ట్ టైం స్వీపర్ మృతి

ప్రజాశక్తి-దుగ్గిరాల

దుగ్గిరాల పంచాయతిలో పార్ట్ టైం స్వీపర్ గా పని చేస్తున్న బి. అనసూయ (65) మంగళవారం ఉదయం మర ణించింది. సర్పంచ్ బాణావత్ ఖుషీ బాయ్ చేతుల మీదుగా ఆమె దహన సంస్కారాలకు రూ.15,000 వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో బాణావత్ వెంకటేశ్వర నాయక్, షేక్ నాగూర్ షేక్ బాజీ పాల్గొన్నారు.



వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న బెజ్జం రామకృష్ణారావు

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎన్నో ఇబ్బందుల కోర్చి చదువుకొని ఉన్నతంగా ఎదిగి ఉద్యోగాలు పొందిన మండలంలోని వడ్డమాను గ్రామానికి చెందిన కొంతమంది పేదలకు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించి పేద విద్యార్థిని కూరపాటి అంజలికి ఇంటర్ ఫీజు రూ 25 వేలకు గాను తొలివిడతగా రూ.9 వేలు సాయంగా అందించారు. వృద్ధులు, వికలాంగులకు ఒక్కొక్కరికి రూ 500ల నిత్యావసర సరుకులు, రగ్గులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతి థిగా రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బెజ్జం రాజేంద్ర, ఉపా ధ్యాయులు కొమరాబత్తిన స్టీవెన్, మంటి సాంబశివరావు,కాకి శ్యామ్,యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పళ్ళం రవికుమార్,రైల్వే విశ్రాంత ఉద్యోగి మేరుగ రత్తయ్య, వడ్డమాను వెల్ విషర్స్ అధ్యక్షులు,మంగళగిరి మాజీ సబ్ రిజిస్టర్ బెజ్జం నాగేశ్వరరావు,బెజ్జం ఫౌండేషన్ అధ్యక్షులు బెజ్జం రామ కష్ణారావు(ఆర్ కె) పాల్గొన్నారు. తొలుత బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.



బెటాలియన్ లో అన్న సమారాధన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్లు విజయదశమి సందర్భంగా మంగళవారం బెటాలియన్‌లో ఉన్న ఆయు ధాలకు, వాహనాలకు పూజ నిర్వహించారు. అనంతరం చిల్డ్రన్ పార్క్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ కెఎస్ఎస్ వి. సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈఎస్ఇ సాయిప్రసాద్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో రెండు ఆపరేషన్ థియేటర్లు

సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో లక్షలాది రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. విజయదశమి సందర్భంగా ఆసుపత్రిలో వివిధ ఆపరేషన్ దియేటర్‌లలో నిర్వహించిన ఆయుధ పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రోగులకు రెండు ఆపరేషన్ దియేటర్‌లలో శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఎముకలు కీళ్ళ విభాగం ఆపరేషన్ థియేటర్, సర్జరీ థియేటర్ లలో కూడా వసతులను ఆధునికరించామని ఆయన చెప్పారు. అదేవిధంగా బ్లడ్ బ్యాంక్‌ను కూడా ఆపరేషన్ థియేటర్ లకు దగ్గర గా ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. రక్తం కొరత లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. దాతలు ఇచ్చిన సొమ్మును సద్వినియోగం జరిగే విధంగా చూడాలన్నారు. గతంలో బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లాలంటే కొంత ఇబ్బందులు పడిన మాట వాస్తవమని ఆయన అన్నారు. ఆ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రక్త నిధిను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. చెడు పై మంచిని సాధించిన విజయంగా ఈ పండుగ చేసుకుంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జెసి రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా నాగయ్య

ప్రజాశక్తి-గుంటూరు



నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్‌గా బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెంకు చెందిన డాక్టర్ పయర్ధ నాగయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జెసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ మెహతాబ్ రాయ్ నియామకపత్రం ఇచ్చినట్లు నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నాగయ్య గుంటూరులో గత 34 ఏళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ప్రైవేటు టీచర్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి సమైఖ్య ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి కృషి చేస్తున్నారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తన సేవలకు గుర్తుగా తనను ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్ జెసి రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు.

పిల్లల ఏకాగ్రతపై కుమార్ రాజా పరిశోధనా పత్రం

ప్రజాశక్తి-గుంటూరు

'ఉన్నత పాఠశాలల పిల్లల ఏకాగ్రతపై రాజయోగ మెడిటేషన్ ప్రభావం ' అనే అంశంపై గుంటూరుకు చెందిన ఉపాధ్యాయుడు ఎన్.కుమార్ రాజా రూపొందించిన పరిశోధన పత్రాన్ని మౌంట్ అబూలోని సెంటర్ ఫర్ అకడమిక్ రీసెర్చ్, రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అందించారు. యోగిక్ సైన్స్‌లో పిహెచ్‌డి కోసం ఈ పరిశోధనా పత్రం రూపొందించినట్లు రీసెర్చ్ గైడ్ డాక్టర్ ఉషాకాటే తెలిపారు.



పరిశోధనా పత్రాన్ని డాక్టర్ ఉషాకాటేకు అందచేస్తున్న కుమార్‌రాజా



అన్నమ్మ, నరసింహారావు దంపతుల జీవితం ఆదర్శం

ప్రొఫెసర్ జి.హరగోపాల్

ప్రజాశక్తి - గుంటూరు


నిజమైన మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావాలకు ప్రభావితమై.. దశాబ్దాల పాటు మానవీయ సంబంధాలకు ప్రతీకగా నిలిచిన నక్క అన్నమ్మ, నరసింహారావు దంపతుల జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. శ్రీకరం చలమయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నమ్మ రెండవ స్మారక సభ బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహిం చారు. మొదటి సమావేశానికి జి.హనుమంత రావు అధ్యక్షత వహించగా ఎన్‌వి నరసింహారావు రచించిన 'నేను నా 75 సంవత్సరాల సామాజిక జీవితం' పుస్తకాన్ని పౌర హక్కుల సంఘం సంఘం (ఏపీ) నాయకులు డాక్టర్ రాజారావు ఆవిష్కరించారు. విప్లవ రచయితల సంఘం నాయకులు సిఎస్‌ఆర్ ప్రసాద్ పుస్తక పరిచయం చేశారు. రెండవ సమావేశానికి విరసం నల్లూరి రుక్మిణి అధ్యక్షత వహించగా అన్నమ్మ స్మారకోపన్యాసం 'మహిళా సాధికారిత, రిజర్వేషన్లు' అంశంపై సామాజిక విశ్లేషకులు కె.సజయ మాట్లాడారు. మూడవ సమావేశానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.శామ్యూల్ అధ్యక్షత వహించగా 'ఫాసిజం, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అంశాలు' అంశంపై ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ ఉపన్యసించారు. నాలుగవ సమావేశానికి నిర్బంధ వ్యతిరేక వేదిక - తెలంగాణ నాయకులు కె.రవిచందర్ అధ్యక్షత వహించగా 'భారతదేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు' అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. ప్రపంచ దేశాలతో పాటు భారతదేశం అనేక సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కుంటోందని, ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవడానికి హేతుబద్ధమైన కార్యాచరణకు పూనుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా కళా మండలి, అభ్యుదయ గాయకులు గేయాలు ఆలపించారు.

వేడుకగా విజ్ఞాన్స్ వర్సిటీ 11వ స్నాతకోత్సవం

1820 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
51 మందికి బంగారు పతకాలు
ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 11వ స్నాతకోత్సవాన్ని సోమవారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరు అయ్యారు. స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, హైదరాబాద్‌లోని విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపిలకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. 1820 మందికి డిగ్రీలు ప్రధానం చేసినట్టు విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. వీటితోపాటు అకడమిక్ గోల్డ్ మెడల్స్, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డులు, చైర్మన్ గోల్డ్ మెడల్స్ అందించారు. డాక్టర్ సుబ్బారావ్ పావులూరి,డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డిగ్రీ పట్టాలతో సమాజంలోకి అడుగుపెడుతున్న మీరు మీ లక్ష్యసాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా పట్టుదల, సంకల్పం మరువకూడదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు ఉద్బోధించారు. విశ్వసనీయతని, సమాజంలో ప్రతిష్టను నిర్ణయించేది క్యారెక్టరేనని పేర్కొన్నారు. డిగ్రీలు చేతికందగానే అది మీ ప్రయాణానికి ముగింపు కాదని తెలుసుకోవాలన్నారు. విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.



కోనేరు హంపికి సత్కారం




ఎస్‌పి వాసిరెడ్డికి పురస్కారం

బంగారు పతకాల విజేతలు

స్నాతకోత్సవం సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆయా విభాగాల్లో సత్తా చాటిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేసింది.

ప్రతిష్టాత్మక చైర్మన్స్ గోల్డ్ మెడల్ : తన్నీరు పూర్ణ వంశీక్రిష్ణ (సీఎస్‌ఈ) లావు వెంకటేశ్వర్ల ఎండోమెంట్ అవార్డ్ : నర్రా క్రిష్ణ ప్రియ (ఈసీఈ) బండారుపల్లి వెంకటేశ్వరరావు అవార్డ్ : ఈదర భువన (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఆలపాటి రవీంద్రనాథ్ ఎండోమెంట్ అవార్డ్ : సబీహ (బయో టెక్నాలజీ) బెస్ట్ లీడర్ అవార్డు : గ్రంధి అజయ్ (బయో టెక్నాలజీ) బెస్ట్ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌అవార్డు :షేక్ అస్విల్ అహ్మద్ (బీసీఏ) బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్స్ అవార్డులలో బయొటెక్నాలజీ విభాగం నుంచి మహమ్మద్ సబిహ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పోకూరి ప్రభుతేజ,సివిల్ నుంచి పిన్ని నరేంద్ర ,సీఎస్ఈ విభాగం టీ.పూర్ణ వంశీకృష్ణ, ఈసీఈ కేఎమ్.సాయి కిరణ్, ఈఈఈ విభాగం వీ.వినయ్, ఐటీ లోఈదర భువన, మెకానికల్ విభాగం మహమ్మద్ ఫిరోజ్, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కే.సత్య వెంకటేష్, టెక్స్‌టైల్ బింగి సంతోష్ కుమార్, బయోఇన్ఫర్మాటిక్స్ విభాగంలో జీ.వంశిత చౌదరి, ఫుడ్ టెక్నాలజీ నుంచి గుడివాడ ద్రోణీ ప్రణీత, బీఎంఈ ఆవులపాటి రమేష్ గాయత్రి, ఫార్మసీ నుంచి అభిషేక్ రాజ్, బీసీఏ టీ.దేవిక, బీబీఏ రాజ క్రిష్ణ లాస్య బీఎస్సీ నుంచి చూడామణి కముజుల,. ఎంబీఏ నుంచి ఎమ్. ప్రశాంతి, ఎంసీఏ నుంచి రెడ్డి గోపాల క్రిష్ణ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ నుంచి ధూళిపాళ్ల శ్రీలక్ష్మి, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి కోలా ధనలక్ష్మి తదితరులు బంగారు పతకాలు సాధించారు.



పావులూరి సుబ్బారావుకు పురస్కారం

అంబరాన్నంటిన సంబరం

డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. విశ్వ విద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సరదగా గడిపిన గడియలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు లేని దంపతులకు అందుబాటు ధరల్లో వైద్యం

హిమబిందు మెటర్నిటీ అండ్ ఫెర్టిలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాధీ ప్రియ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో అన్ని వర్గాలకు చెందిన సంతానం లేని దంపతులకు అందుబాటు ధరలతో సంతాన ప్రాప్తికి విజయవంతంగా తమ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తున్నట్లు హిమబిందు మెటర్నిటీ అండ్ ఫెర్టిలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాధీప్రియ చెరుకూరి అన్నారు. మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతు మహిళలు సరైన పోషకాహారం తీసుకోకపోవడం పని ఒత్తిడి, అలసట, మానసిక సమస్యలతో వత్తిడికి గురవు తున్నారన్నారు. ప్రధానంగా ఆహారపు అలవాట్లు జంక్ ఫుడ్, అధిక మసాలా కలిగిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సాంప్రదాయ ఆహారం తీసుకోవడం ద్వారా కొంతమేర గైనిక్ సమస్యలు భారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారు. వివాహం అనంతరం తల్లిందండ్రులు కావాలని ఎదురు చూస్తుంటారన్నారు. ఆరోగ్య సమస్యలు ఆహారపు అలవాట్లు నేపథ్యంలో ఏర్పడుతున్న సమస్యలకు తమ హాస్పిటల్‌లో సమర్థవంతంగా అంతర్జాతీయ ప్రమాణాలతో నరసరావుపేటలో ఐవీఎఫ్ సెంటర్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ సేవలు హాస్పిటల్ స్థాపించిన దగ్గర నుండి విజయవంతంగా అందిస్తున్నామన్నారు. ప్రతి మహిళ బిడ్డ చేత అమ్మ అనిపించుకోవాలని కోరుకుంటుందని ఆ మహిళ తల్లి కాలేనప్పుడు మానసికంగా కంగిపోతుందని చుట్టూ ఉన్న సమాజం నుండి వివక్ష ఎదుర్కొంటుందన్నారు. ఈ క్రమంలో కొంతమంది దంపతులు మానసికంగా కృంగి పోకుండా సరైన వైద్యులు సంప్రదించి వైద్య సేవలు పొందడం ద్వారా ఫలితం ఉంటుందన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో సైన్స్ సాధించిన అపూర్వమైన ప్రగతితో సంతానం లేని దంపతులకు సంతానం ప్రసాదించే స్థాయిలో సైన్స్ అభివృద్ధి చెందిందన్నారు. పిల్లలు లేని దంపతులు నుండి అండాన్ని వీర్యాన్ని సేకరించి లేబరేటరీలో ఫలదీకరణ చేసి టెస్ట్ ట్యూబ్ బేబీలను పుట్టించే స్థాయికి సైన్స్ అభివృద్ధి చెందిందని ఆమె తెలిపారు. ఇటువంటి అధునాతన వైద్యాన్ని అన్ని వర్గాల దంపతులకు అందుబాటు ధరలో కార్పొరేట్ స్థాయి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ మాతృత్వ సెంటర్ విజయవంతంగా నడుపుతున్నామన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ 24 గంటల వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సంతానం కలుగక ఇబ్బందులు పడుతున్న దంపతులు తమను సంప్రదించి మాతృత్వపు అనురాగాన్ని అనుబంధాన్ని సొంతం చేసుకోవాలని ఆమె ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

